క్లుప్తంగా

బాణసంచా విక్రయాలకు ప్రభుత్వ అనుమతి తప్పనిసరి

కారెంపూడి సీఐ జయకుమార్

కారెంపూడి: ప్రభుత్వ అనుమతులు లేకుండా బాణసంచా అమ్మితే క్రిమినల్ కేసులు పెడతామని కారెంపూడి సీఐ దార్ల జయకుమార్ ఆదివారం హెచ్చరించారు. కారెంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల పరిధిలో దీపావళి టపాసులు విక్రయాలు చేయాలనుకునే వారు ముందుగా నిర్దేశించిన ప్రకారం ప్రభుత్వ అనుమతులు తప్పనిసరిగా పొందాలన్నారు. లైసెన్స్ లేకుండా షాపులు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాలలో వ్యాపారులు బాణసంచా విక్రయాలకు తప్పని సరిగా లైసెన్సులు పొందాలన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా షాపులు కూడా ఏర్పాటు చేయడానికి వీల్లేదని తగిన రక్షణ, భద్రతా చర్యలు తీసుకున్న తర్వాతే ప్రభుత్వ అధికారులు సూచించిన స్థలంలోనే షాపులు ఏర్పాటు చేసుకోవాలని సీఐ జయకుమార్ కోరారు.

మాచర్లలో భారీ వర్షం



మాచర్ల : నియోజకవర్గంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పట్టణంలో కుంభవృష్టి వర్షంతో ప్రజలు బయటకు రావడానికి ఇబ్బంది పడ్డారు. గుంతలన్నీ వర్షం నీటితో నిండిపోయాయి.

పిడుగురాళ్లలో వర్షం

పిడుగురాళ్ల: పట్టణంలో ఆదివారం వర్షం పడింది. సాయంత్రం ఒక గంట పాటు వర్షం కురిసింది. ఇప్పటి వరకు వర్షం లేక పంటలు సైతం ఎండిపోతున్నాయని అల్లాడిపోతున్న రైతులకు ఈ వర్షం కాసుల వర్షమేనని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షం పంటలకు కాస్త ఉపశమనం కల్పిస్తుందని రైతులు తెలియజేశారు.

పులిపాడు సర్పంచ్‌గా ఓర్సు శివపార్వతి

గురజాల : పులిపాడు గ్రామ సర్పంచ్‌గా ఓర్సు శివపార్వతి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మండల పరిధిలోని పులిపాడు గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నూతన సర్పంచ్‌గా ఓర్సు శివపార్వతి ప్రమాణ స్వీకారం చేశారు. ఇప్పటి వరకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన కన్నెబోయిన సైదులు సెలవుపై వెళ్లడంతో ఓర్సు శివపార్వతి బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), కొమ్మినేని రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి శివ శంకర్ తదితరులున్నారు.

రైలు కింద పడి యువకుడు మృతి

పిడుగురాళ్ల: రైలు కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని జానపాడు రోడ్డులోని రైల్వే గేటు సమీపంలో ఆదివారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు... పట్టణానికి చెందిన షేక్ అన్వర్(25) అనే వ్యక్తి జానపాడు రోడ్డులోని రైల్వే ట్రాక్ సమీపంలోని 67వ గేటు దగ్గర్లో అటుగా వచ్చిన రైలు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని మృతిపై రైల్వే పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడి ఘటనపై పరస్పర కేసులు

నరసరావుపేట టౌన్: ఇరువురు యువకులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న సంఘటనపై రెండు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ వీరేంద్రబాబు ఆదివారం తెలిపారు. ఐలా బజారుకు చెందిన నిమ్మిశెట్టి నాగేంద్రబాబుకు రావూరి నాగవిజయకుమార్ మధ్య శనివారం రాత్రి వివాదం నెలకొంది. ఈ క్రమంలో ఇద్దరు ఒకరిపై ఒకరు బీరు సీసాలతో దాడికి పాల్పడ్డారు. సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఊపిరితిత్తుల సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు



నాదెండ్ల: ఊపిరితిత్తుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటే దీర్ఘకాలిక వ్యాధిగా మారకుండా నివారించవచ్చని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ నంద్యాల రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. సాతులూరు గ్రామంలో ఆదివారం నాదెండ్ల మండల పరిధిలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు నంద్యాల హాస్పటల్స్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ ఊపిరితిత్తులకు సోకే ఇన్‌ఫెక్షన్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ డివిజన్ అధ్యక్షుడు షేక్ బాజీ, కమ్యూనికేటర్ ఆరేటి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు షేక్ నాగూర్‌వలి, కోశాధికారి జగన్‌మోహన్‌రావు, సభ్యులు ఆవుల శ్రీనివాసరావు, రామారావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా బీఎల్‌వోలు పనిచేయాలి

డీఆర్‌వో వినాయకం



రెంటచింతలలోని వైఆర్‌ఎస్ ఉన్నత పాఠశాలలో పోలింగ్‌బూత్‌ల వద్ద ఫారం-8 స్వీకరిస్తున్న డీఆర్‌వో వినాయకం

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వోలు పార్టీలకు అతీతంగా పనిచేయాలని పల్నాడు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌వో), మాచర్ల ఇన్‌చార్జి ఎన్నికల అధికారి వినాయకం అన్నారు. ఆదివారం ఆయన తహసీల్దార్ కె.పుల్లారావుతో కలిసి రెంటచింతలలోని 228, 229, 230, 231, 232, 238 పోలింగ్‌బూత్‌లను ఆకస్మికంగా సందర్శించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ఓటర్ల లిస్ట్‌లో మృతుల ఓట్లను, డబుల్ ఎంట్రీలను కచ్చితంగా తొలిగించాలన్నారు. ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు బీఎల్‌వోలు మండలంలోని 11 గ్రామాలకు సంబంధించి 51 పోలింగ్ కేంద్రాలలో సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో) వారి పరిధిలోని ప్రతి ఇంటికి కచ్చితంగా వెళ్లి అర్హత ఉన్న వారికి ఓటు నమోదు చేయాలన్నారు. ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చేయడానికి ఇప్పటికే చర్యలు చేపట్టారన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే బీఎల్‌వోలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఇప్పటి వరకు ఫారం-6, ఫారం-7, ఫారం-8లకు సంబంధించి మొత్తం 140 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పుల్లారావు తెలిపారు. దరఖాస్తుదారుల నుంచి డీఆర్‌ఓ వినాయకం ఫారం-6, ఫారం-8లను స్వీకరించారు. 197వ నెంబరు నుంచి 247 పోలింగ్ బూత్ వరకు రెంటచింతల మండలానికి చెందిన పోలింగ్ కేంద్రాలుగా ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారన్నారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ జె.రాజారావు, ఆర్ఐ దాసరి కాంతారావు, వీఆర్వోలు, బీఎల్‌వోలు ఉన్నారు.

పిడుగురాళ్లల్లో ఎన్నికల స్పెషల్ డ్రైవ్



ఎన్నికల బూత్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని ఎన్నికల బూత్‌ల పరిధిలో ఎన్నికల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఆదివారం నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని 33 వార్డుల్లో 17 సచివాలయాల పరిధిలో 53 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. పోలింగ్ బూతుల ప్రాంతంలో ఆయా పోలింగ్ బూత్‌ల ఇన్‌చార్జిలు, బీఎల్‌వోలు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకునే వారి వద్ద నుంచి ఆధార్ కార్డు, 10వ తరగతి ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే కార్యక్రమం చేశారు. పేర్లలో అక్షర దోషాలు ఉన్నా, మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి ఓట్లను తొలగించే కార్యక్రమం, అడ్రస్‌లు మార్పులు చేర్పులతోపాటు ఒక వ్యక్తికి రెండు ప్రాంతాలలో ఓటు ఉంటే అభ్యర్థన మేరకు ఒక ప్రాంతంలోనే ఓటు ఉండేలా అవగాహన కల్పించటం వంటి కార్యక్రమాలు ఈ స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించారు. పట్టణంలోని అన్ని బూత్‌ల వద్ద బూత్ లెవల్ అధికారులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు.

స్పెషల్ డ్రైవ్‌లో 78 దరఖాస్తులు

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాల్లో మొత్తం 78 దరఖాస్తులు అందినట్లు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. మండంలలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు ప్రసాద్ ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఓటరు నమోదు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల వద్ద రక్షణ, సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. అభ్యంతరాలు ఉంటే అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రామలింగేశ్వర దేవాలయ పునర్నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులతో అసోసియేషన్ సభ్యులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండపై వేంచేసి ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి సాయి పతాంజలి యోగా అసోసియేషన్ ప్రెసిడెంట్ కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.5లక్షలు విరాళాలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా కొండపై జరుగుతున్న పనులను కమిటీ సభ్యులతో కలిసి అసోసియేషన్ సభ్యులు పరిశీలించారు. ప్రసన్నాంజనేయ ఫర్టిలైజర్స్ రూ.1,00,116, చిన్ని ఐరామ్మూర్తి రూ.51,216లు, వెంకటరమణ ప్రింటింగ్ ప్రెస్, చిలంకూరి సురేష్‌బాబు, గుండా బాలయ్య, గుడిపాటి నాగేశ్వరరావులు రూ.51,116లు చొప్పున, మొగిలి మల్లికార్జునరావు, పులికొండ శ్రీనివాసరావు, సూర్య దాల్ ఇండస్ట్రీస్, శంకర్, పొత్తూరి సుబ్బారావులు రూ.25,116ల చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పెండేల పుల్లారావు, పులిపాటి రామారావు, జాజుల మాల్యాద్రి, రెడ్డి నగేష్‌బాబు, గంధం బాలిరెడ్డి, ములకా రామతులసిరెడ్డి, గజవల్లి నాగపవన్‌కుమార్, చందోలు మల్లికార్జునరావు, అచ్యుత కృష్ణ పాల్గొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్ని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

మాచవరం: పల్నాడు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని పిడుగురాళ్ల మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పల్నాడు ప్రాంతంలో రైతులు వేసిన పంటలకు సరైన వర్షాలు లేక ఎండిపోయే దశకు చేరుకున్నాయని, రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతులు సాగు చేస్తున్న పంటలను కాపాడేందుకు నాగార్జున సాగర్ కుడి కాల్వ ద్వారా సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం పల్నాడు ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించి రైతాంగాన్ని ఆదుకోవాలని విన్నవించారు. పల్నాడు జిల్లా సమస్యలను స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కరువు జిల్లాగా ప్రకటించేలా చొరవ తీసుకోవాలని కోరారు.

పిల్లల చదువులపై తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలి

ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

నరసరావుపేట ఈస్ట్: తల్లిదండ్రులు తమ పిల్లలను కష్టపడి చదవమని ప్రేరేపించేకన్నా ఇష్టపడి చదవమని ప్రోత్సహించాలని ప్రముఖ రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణులు, విద్యావేత్త యండమూరి వీరేంద్రనాథ్ తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని టౌన్‌హాల్‌లో ఆదివారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో యండమూరి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లలను గారాబం చేయకుండా ప్రేమతో వారి చదువులపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. చదువు చాలా బాగుంటుందనీ, ఉన్నత చదువులతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వారికి తెలియచెప్పాలని తెలిపారు. విద్యార్థుల చేతిరాత బాగుండేలా చూడాలన్నారు. డబ్బు లేకపోతే జీవితంలోకి పైకి రాలేరు అనే నానుడి తప్పని, చదువు ద్వారా జీవితంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని కోరారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తమ విద్యార్థులను గ్లోబల్ లీడర్స్‌గా తీర్చిదిద్దాలని యాజమాన్యాన్ని కోరారు. స్కూల్ కార్యదర్శి నాగోతు ప్రకాశరావు మాట్లాడుతూ, అధునాతన మౌలికవసతులు, అపార అనుభవం గల ఉపాధ్యాయుల బృందంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తమ స్కూల్ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలలో శిక్షణ ఇస్తామన్నారు. స్కూల్ ఏపీ హెడ్ ఎ.రామరాజు మాట్లాడుతూ, విద్యారంగంలో పేరుగాంచిన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో తమ స్కూల్ ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందన్నారు. స్కూల్‌లో 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభించామని, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐడీపీఎస్ జాతీయ ఫ్రాంచైజ్ హెడ్ సుభాష్ కలువ, శ్రీదత్త హాస్పటల్ ఎండీ డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వరంలో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్ట్‌కు జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు.

ప్రత్యేక అలంకరణలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని నాగుల గుడి దేవస్థానంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ప్రత్యేక అలంరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గత మూడు రోజుల నుంచి స్వామివారి భక్తులు స్వామివారి మాలధారణ కార్యక్రమం సందర్భంగా స్వామివారిని దర్శించుకొని మాలధారణ స్వీకరించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

విశ్వ బ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడిగా పోతులూరయ్య

సత్తెనపల్లి: విశ్వబ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడిగా రిటైర్డ్ ఉపాధ్యాయుడు కోటగిరి పోతులూరయ్యను ఎన్నుకున్నారు. విశ్వబ్రాహ్మణ సంఘం పట్టణ నూతన కమిటీని ఆదివారం వేద కళాశాలలోని సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా చింతాడ రమేష్, ప్రధాన కార్యదర్శిగా దాసు భాస్కరాచారి, కోశాధికారిగా వంగిపురపు సూర్యనారాయణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా వానపాముల రత్నాచార్యులు, టి.గురుభూషణాచారి, సుంకర ఉమామహేశ్వరాచారి, సిద్దు శ్రీనివాస్, కార్యదర్శులుగా కోటగిరి గోపి ప్రసన్న కుమార్, మహంకాళి వెంకట గోవిందాచారి, ముమ్మడి అనంతాచారి, తిప్పర్తి శంకర్ బాబు, ప్రధాన సలహాదారునిగా రంగు నాగభూషణం, ఆడిట్ కమిటీ సభ్యులుగా పురుషోత్తం, సభ్యులుగా పది మంది ఎన్నికయ్యారు. అడ్‌హక్ కమిటీ చైర్మన్ చింతాడ రమేష్, వంగిపురపు కోటేశ్వరరావులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు.

బిందు సేద్యం విధానాన్ని అవలంభించాలి

శావల్యాపురం: ఉద్యాన పంటలు సాగు రైతులు బిందు సేద్యం సాగును అవలభించాలని ఉద్యానశాఖాధికారి షేక్ నబీ రసూల్ ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం వలన పంటలకు ప్రాణం పోసినట్లు ఉందన్నారు. దీంతో రైతులకు ఉపశమనం కలిగిందన్నారు. మిరప పంట సాగు చేసే రైతులు బిందు సేద్యం విధానాన్ని అవలింభించడం ద్వారా సాగు నీరు వృథా కాకుండా పంటలకు సంరక్షణతో పాటు, ఎకరం సాగుకు వినియోగించే నీరు మూడు ఎకరాల మేర సాగు చేయటానికి వీలుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం మిరప పంట ఎదుగుదల దశలో ఉండటంతో పాటు కొన్ని ఏరియాలో పూత దశలో ఉందన్నారు. నీటి వసతి ఉన్న ఏరియాలో రైతులు అధికంగా మిరప పంటను సాగు చేశారన్నారు. బెట్ట పరిస్థితులను అధిగమించటానికి రైతులు తప్పనిసరిగా యూరియా ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఈవిధంగా చేయటం వలన భూమిలో తేమ శాతం తగ్గకుండా ఉంటుందన్నారు. అలాగే పంట బెట్ట దశ సూచనలు కనిపిస్తే రసం పీల్చు పురుగులు, పైముడత, కింద ముడత వైరస్ సోకకుండా తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలో భాగంగా ఓక్కో ఎకరానికి 100 ఎంఎల్ వేపనూనె, హిమోడాక్లోఫ్రిడ్ రసాయనిక ఎరువులను పిచికారీ చేయాలన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు వాగ్దేవి విద్యార్థులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన విద్యార్థులతో వాగ్దేవి కళాశాల యాజమాన్య ప్రతినిధులు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఒ.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. ఈనెల 2వ తేదీన ఖాజీపాలెంలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరుజిల్లా జట్టు ఎంపిక పోటీలలో తమ విద్యార్థులు అండర్-19 విభాగంలో గుత్తికొండ మోహన్ (డిస్కస్ త్రో, జావలిన్ త్రో), జజ్జూరి యశ్వంత్ (రన్నింగ్), కె.గోపీచంద్ (డిస్కస్ త్రో), రావెళ్ల వెంకటసాయి (ట్రిపుల్ జంప్), షేక్.షాజహాన్‌బి (డిస్కస్ త్రో, షాట్‌పట్), ఎస్.వినీల, ఎం.సౌమ్య, బి.వెన్నెల (రన్నింగ్), అండర్-17 విభాగంలో షేక్.అల్మాస్ (హర్డిల్స్) ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైనట్టు వివరించారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్లు కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పి.కృష్ణారావు, పి.వి.అచ్యుతరావు, పీడీ రాయల ఆంజనేయులు అభినందించారు.

చలికాలంలో వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలి

మండల ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్



క్రోసూరు: చలికాలంలో వృద్ధులకు కీళ్ల బిగుసుకుపోతాయని, తరచు కీళ్లను కదిలిస్తూ వ్యాయామం, నడక వలన ఉపశమనం పొందాలని మండల ఆరోగ్యవిస్తరణాధికారి శిఖాశ్యాంసన్ ఆదివారం తెలిపారు. క్రోసూరులోని ఎస్సీ కాలనీ సందర్శించి శ్యాంసన్ అక్కడి ప్రజలతో చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పలు సూచనలు చేయటం జరిగింది. చలికి చిన్నారులకు జలుబు, దగ్గు, వంటి వ్యాధులు వచ్చి రోగనిరోధక శక్తి తగ్గుతుందని అన్నారు. దీంతో ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయని అన్నారు. అందుకని పిల్లలకు అన్నిరకాల టీకాలు వేయించాలని సూచించారు. గోరు వెచ్చని నీటితో స్నానం చేయించాలన్నారు. కొద్దిసేపు ఎండలో ఉండటం వలన డీ విటమిన్ అందుతుందన్నారు. మహిళలు, పిల్లలు, వృద్ధులు చలి నుంచి రక్షణ పొందటానికి చలికోటు, మఫ్లర్లు, చెవులకు టోపీలు ధరించాలన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నాం

జెండా చెట్టు ప్రారంభోత్సవంలో పీఆర్కే



జెండా చెట్టును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



అభినందనలు తెలుపుతున్న పలువురు మైనార్టీ నేతలు

మాచర్ల: పట్టణంలోని ఐదో వార్డులో బండ్ల బజారులో రూ.3 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన జెండా చెట్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.లక్షల వ్యయంతో మైనార్టీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ముస్లింల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. నియోజకవర్గ స్థాయిలో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో మసీదులు, కమ్యూనిటీ హాల్స్ కోసం తమవంతు సహాయ సహకారాలు అందించామన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనలతో ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాబోవు రోజుల్లో ముస్లింలకు అభివృద్ధి పథకాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న యేసోబు, ఆయా వార్డుల కౌన్సిలర్లు మందా సంతోష్, వేల్పుల గురవయ్య, షేక్ కరిముల్లా, శంకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ జలీల్, లెనిన్‌బాబు, మైనార్టీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

సత్రశాల దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలి

ఏసీ సత్యనారాయణరెడ్డి



దేవదాయశాఖ అధికారులను సన్మానిస్తున్న సత్రశాల దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బ్రహ్మారెడ్డి

రెంటచింతల: ఎంతో పురాతనమై శైవక్షేత్రం సత్రశాల గంగ భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానం అభివృద్ధికి ట్రస్ట్‌బోర్డు కృషి చేయాలని దేవదాయశాఖ ఏసీ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన జిల్లా దేవదాయ శాఖ కార్యాలయం పర్యవేక్షణాధికారి శ్రీధర్‌రెడ్డితో కలిసి దేవస్థానంలో స్వామివార్లకు ప్రధాన అర్చకులు చిట్యాల శివయ్య శర్మ నేతృత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పవిత్రమైన కార్తీకమాసంలో దేవస్థానంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వసతులను ఏర్పాటు చేయాలన్నారు. శనివారం రాత్రి డీసీ ఈమని చంద్రశేఖర్‌రెడ్డి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానంలో త్వరలో చేపట్టనున్న అభివృద్ధి పనులను, ప్రతిష్ఠించనున్న దేవతామూర్తుల విగ్రహాల వివరాలను చైర్మన్ ఉన్నతాధికారులకు వివరించారు. ముందుగా వారికి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈవో నెమలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గొట్టం భాస్కర్ రెడ్డి ఘనంగా స్వాగతం పలికి దుశ్శాలువలతో సన్మానించారు.

కృష్ణానదిలో గల్లంతైన యువకుడు

- పులిచింతల ప్రాజెక్టు సమీపంలో ఘటన
- అన్వేషిస్తున్న పోలీసులు



అచ్చంపేట: కృష్ణానదిలో యువకుడు గల్లంతైన ఘటన ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టుకు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. అచ్చంపేట ఎస్ఐ సీహెచ్ మణికృష్ణ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా, మేళ్లచెరువు మండలానికి చెందిన యాంపాంగు సందీప్(19) అనే యువకుడు మరో నలుగురు స్నేహితులతో పులిచింతల ప్రాజెక్టును సందర్శించడానికి వచ్చాడు. ప్రాజెక్టుకు దిగువలోని మాదిపాడు పంచాయతీ, జడపల్లితండాకు సమీపంలోని పుష్కరఘాట్ వద్ద స్నేహితులంతా స్నానం చేయడానికి నదిలో దిగి ఈతకొట్టడం ప్రారంభించారు. వీరిలో సందీప్ నదిలోతుల్లోకి వెళ్లగా స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినా సాధ్యపడలేదు. విషయం తెలుసుకుని తన సిబ్బందితో ఘటనా స్థలాలని చేరుకుని నదిలో పడవలు, ఈతగాళ్ల సహాయంతో అన్వేషించినా ఫలితం లేకపోయిందని ఎస్ఐ తెలిపారు. అయితే చీకటి పడటంతో వెతకడం ఆపేసామని సోమవారం ఉదయం తిరిగి గజ ఈతగాళ్ల సహాయంతో ప్రారంభిస్తామన్నారు. అయితే నదికి ఇవతలి ఒడ్డు పల్నాడు జిల్లా కాగా, అవతలి ఒడ్డు తెలంగాణ రాష్ట్రం, సూర్యాపేట జిల్లా పరిధిలోకి వస్తుందని ఎస్ఐ మణికృష్ణ తెలిపారు. గల్లంతైన వ్యక్తి ఆచూకి ఏవైపు దొరికితే ఆ వైపున కేసు నమోదు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

రాజుపాలెం: లారీ అతివేగంతో వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని నెమలిపురి శివారు శ్రీనివాస్ నగర్ వద్ద అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై శనివారం రాత్రి జరిగింది. సత్తెనపల్లి పట్టణంలోని రంగా కాలనీకి చెందిన మేరుమళ్ల శశాంక్(24) తన మిత్రుడైన అకుల రాఘవతో కలసి ద్విచక్ర వాహనంపై నకరికల్లులోని స్నేహితుడిని కలిసేందుకు బయలుదేరారు. మార్గంమధ్యలో శ్రీనివాస్‌నగర్ వద్ద హైవేలో యూటర్న్ తీసుకుంటుండగా అదే సమయంలో అతివేగంతో వచ్చిన లారీ వాహనాన్ని ఢీకొట్టింది. వాహనం నడుపుతున్న శశాంక్ కింద పడడంతో లారీ వెనుక చక్రాలు శశాంక్‌పై నుంచి పోవడంతో నుజ్జునుజ్జు అయ్యాడు. వెనుక కూర్చొన్న రాఘవ ఎగిరి పడడంతో గాయాలయ్యాయి. సత్తెనపల్లి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. శశాంక్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఏఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాహు-కేతువులకు విశేష పూజలు



అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో విశేష అలంకరణలో రాహు-కేతువులు

నకరికల్లు: దోషాలను తొలగి సకల సుఖాలు సిద్ధించాలని రాహు-కేతువులకు భక్తులు ఆదివారం విశేష పూజలు చేశారు. మండలంలోని నర్సింగపాడులో గల అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానలో రాహు-కేతువులకు విశేష పూజలు చేశారు. రాహు-కేతువులను పూజించేందుకు ఆదివారం విశేషమైన రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పల్నాడు జిల్లాలోని పలు గ్రామాలతో పాటు హైదరాబాద్ తదితర పాంతాల నుంచి కుటుంబ సమేతంగా పూజల కోసం తరలివచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు భక్తులు మొక్కులు చెల్లించారు.

పాముకాటుకు గేదె మృతి

నాదెండ్ల: పొలంలో మేత మేస్తున్న గేదెను పాము కాటు వేయటంతో మృతి చెందిన సంఘటన మండలంలోని సాతులూరు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు బండారుపల్లి రాఘవ ఆదివారం ఉదయం గేదెలను మేపేందుకు పొలానికి తోలుకెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో పాముకాటుకు గురై గేదె మృతి చెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని రైతు తెలిపారు.